క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి సభ్యులు

పెందుర్తి: త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పెందుర్తి మండలం రాంపురంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం, శ్రీకృష్ణ జన్మాష్టమి ఊరేగింపు విశిష్టతపై అవగాహన కల్పించారు. ఆధ్యాత్మిక గ్రంథం విశిష్టతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి విజయరాంపురం కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథ రావు, ప్రతినిధులు వి.సురేష్, బి.పైడన్న, కె.సంతోష్, లక్ష్మి, వి.భవాని, గాయత్రి, పి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శభాష్



శ్రమదానంతో రోడ్డు బాగు చేస్తున్న చింతగట్ల యువకులు

పెందుర్తి: గోతుల మయం అయిన నరవ–సబ్బవరం రహదారిలో అమృతపురం వద్ద రోడ్డును పెందుర్తి మండలం చింతగట్లకు చెందిన జీకే రాజు యూత్ సభ్యులు ఆదివారం బాగు చేశారు. దాదాపు 15 మంది యువకులు శ్రమదానం చేసి రోడ్డుపై ఏర్పడిన గోతులు పూడ్చారు. వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అయ్యారక వెల్ఫేర్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గనిశెట్టి కనకరాజు, యూత్ ప్రతినిధులు ఎస్.నాగరాజు, కె.ఈశ్వరరావు, కె.సంతోష్, కెఅర్జున, ఎం.కోటి, జి.గణేష్, బి.కృష్ణ, జి.రాజు, ఎం.బాలు తదితరులు పాల్గొన్నారు.

సామ్రాట్‌కు అంబేడ్కర్ సేవారత్న అవార్డు



సామ్రాట్ కుమార్‌ను అవార్డుతో సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

సబ్బవరం: మండలంలోని అమృతపురం గ్రామానికి చెందిన సాంస్కృతిక, సామాజిక సేవా వేత్త గొటివాడ సామ్రాట్‌కుమార్ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జాతీయ సేవారత్న పురస్కారం అందుకున్నారు. నగరంలోని పౌర గ్రంథాలయంలో ఆదివారం ప్రతిభ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సామ్రాట్‌ను ఘనంగా సత్కరించి అవార్డు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, జాతీయ జర్నలిస్ట్ సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఆదినారాయణ, చెంగల చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జూలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



పోటీలో వేసిన చిత్రాలతో విద్యార్థులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఆదివారం చిత్రలేఖనం పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ నెల 12న అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. జూ బయోస్కోప్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభించిన పోటీల్లో నగరంలోని ప్రభుత్వ పాఠశాలలతోపాటు వివిధ స్కూళ్లకు చెందిన 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారి ప్రతిభకు పదును పెట్టి ఏనుగులు, పర్యావరణానికి సంబంధించిన చిత్రాలు వేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా మాట్లాడుతూ ఏనుగులపై విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పిల్లలను పోటీలకు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జూ డిప్యూటీ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(డీసీఎఫ్) జి.మంగమ్మ, అసిస్టెంట్ క్యూరేటర్లు గోపి, గోపాలనాయుడు, సెక్షన్ ఆఫీసర్లు భారతి, రాజేష్ సిబ్బంది పాల్గొన్నారు.

శివారు.. పేకాట జోరు

- అదే దారిలో కోడి పందాలు
- పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లో విచ్చలవిడిగా జూదం
- తోటలు, అపార్ట్‌మెంట్‌లే డెన్‌లు
- బడాబాబుల కోసం ప్రత్యేక స్థావరాలు



పెందుర్తి శివారు ప్రాంతంలో పేకాట డెన్(ఫైల్)

పెందుర్తి: కాయ్ రాజా కాయ్..లోపు.. బయట.. ఇది నగర శివారు ప్రాంతాల్లో వినిపిస్తున్న మాట. అదేనండి పేకాట.. కోడిపందెం రాయుళ్ల హడావుడి మళ్లీ మొదలైంది. ఐపీఎల్..ఇతర లీగ్‌ల ఫీవర్ తగ్గిన తర్వాత పందెం రాయుళ్లు మళ్లీ జూదం వైపు దృష్టి సారించారు. వారాంతాల్లో వీటి జోరు మరింతగా పెరిగింది. నగర శివారు ప్రాంతాలతో పాటు పెందుర్తి, సబ్బవరం మండలాల్లోని తోటలు, అపార్ట్ మెంట్‌లలో పేకాట జోరుగా సాగుతోంది. ఇక చెరువు గట్లు, నిర్మానుష్య ప్రాంతాల్లో కోడి పందాలు జరుగుతున్నాయి.

ఆటకు సై

స్థానికులతో పాటు నగరం నుంచి వస్తున్న బడాబాబులు 'ఆట'కు సై అంటున్నారు. పేకాట కోసం ప్రత్యేకంగా వేసిన డెన్లలో నిత్యం రూ.లక్షల్లో చేతులు మారుతున్నాయి. మాయా జూదం కోసం భూములు, వాహనాలు తాకట్టులు పెట్టి మరీ రంగంలోకి దిగుతున్నారు. పేకాట డెన్లు మామిడి, సరుగుడు, జీడిమామిడి తోటలతో పాటు జనవాసాల్లోని అపార్ట్‌మెంట్‌లలో కూడా నడుస్తుండడం గమనార్హం. మరోవైపు కోడి పందాలు కూడా రూ.వేలల్లో పందాలు సాగుతున్నాయి. కింది స్థాయి పోలీసు సిబ్బందిని మచ్చిక చేసుకుని ఉన్నతాధికారుల కళ్లుగప్పి కొందరు వ్యక్తులు ఈ డెన్‌లు నడిపిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

తోటలు ఉండడంతో అనుకూలం

పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లో తోటలు అధికంగా ఉన్నాయి. పెందుర్తి, అక్కిరెడ్డిపాలెం, నరవ, జెర్రిపోతులపాలెం, సతివానిపాలెం, చినముషిడివాడ వుడాకాలనీ, సబ్బవరం, గొటివాడ, అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం, గుల్లేపల్లి, బోదువలస, దేవీపురం తదితర ప్రాంతాల్లో వందల ఎకరాల్లో జీడిమామిడి, మామిడి, సరుగుడు తోటలు ఉన్నాయి. ఇవి పేకాట, కోడిపందాలకు అనుకూలంగా ఉన్నాయి. కేవలం పేకాట కోసమే కొందరు వ్యక్తులు ఫ్లాట్లను అద్దెకు తీసుకుంటున్నారంటే జూదం ఎంత జోరుగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. పెందుర్తి, సుజాతనగర్, పురుషోత్తపురం, కృష్ణరాయపురం, వేపగుంట ప్రాంతాల్లోని పలు అపార్ట్‌మెంట్లు పేకాట డెన్‌లుగా ఉన్నాయి. నగరం కంటే శివారు ప్రాంతం అయితే పోలీసుల నిఘా పెద్దగా ఉండదని నగరం నుంచి అనేక మంది పేకాటరాయుళ్లు పెందుర్తి ప్రాంతానికి వస్తున్నారు. సాధారణ రోజుల్లో జరిగే ఆట కంటే..శని,ఆది వారాల్లో జరిగే ఆట పదింతలు ఎక్కువ ఉంటుంది.

గ్రూప్‌గా ఏర్పడి డెన్ నిర్వహణ

కొందరు వ్యక్తులు గ్రూపుగా ఏర్పడి ఈ డెన్‌లను నడిపిస్తున్నారు. వీరు ఆటకు ఇంత అని నిర్ధారించి ఆటగాళ్ల దగ్గర వసూలు చేస్తుంటారు. దాంతో మద్యం, ఇతరత్రా సౌకర్యాలు కల్పిస్తుంటారు. ఇదిలా ఉండగా ఆటలో పందాలు రూ.లక్షల్లోనే ఉంటాయి. మరికొంత మంది భూములు, వాహనాల పత్రాలు పెట్టి పందాలు కాస్తుంటారు.



పెందుర్తి పోలీసులు స్వాధీనం చేసుకున్న పందెం కోళ్లు(ఫైల్)

నిఘా పెట్టాల్సిందే..

పెందుర్తి, సబ్బవరం ప్రాంతాల్లో పేకాట, కోడి పందాల స్థావరాలకు కిందిస్థాయి పోలీసు సిబ్బంది చేయూత ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. ఒకవేళ అధికారులు దాడులకు సిద్ధమైతే సిబ్బంది పేకాటరాయుళ్లకు సమాచారం ఇచ్చి వారు పారిపోవడానికి సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించిన విచ్చలవిడిగా సాగుతున్న జూదానికి బ్రేక్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.

సండే సందడి



తిక్కవానిపాలెం తీరంలో జలకాలాడుతున్న సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం సముద్ర తీర ప్రాంతాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. అనకాపల్లి, గాజువాక, సబ్బవరం, లంకెలపాలెం, పరవాడ, గవర్ల అనకాపల్లి, స్టీల్‌ప్లాంటు, దీపాంజలినగర్ ప్రాంతాల నుంచి అనేక మంది ఆదివారం ఉదయమే తీర ప్రాంతాలకు చేరుకున్నారు. ప్రత్యేకంగా టెంట్లు వేసుకుని ఉత్సాహంగా గడిపారు. ఇసుక తిన్నలపై యువత కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. తీరంలో సముద్ర స్నానాలు ఆచరించి ఎంజాయ్ చేశారు.

మలుపుల మాటున ముప్పు!

అంధకారంతో తరచూ ప్రమాదాలు



కలపాక రహదారిలో ప్రమాదకరమైన మలుపు

పరవాడ: తంతడి–కలపాక రహదారిలో ప్రమాదకరమైన మలుపులు ప్రయాణికులను భయపెడుతున్నాయి. హిందూజా పరిశ్రమకు బొగ్గును తరలించే భారీ వాహనాలతో పాటు వివిధ గ్రామాల ప్రజలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ రహదారిలో కనీసం వీధి లైట్లు లేకపోవడంతో మలుపుల వద్ద భారీ వాహనాలు అదుపుతప్పి బోల్తా పడుతున్నాయి. సోమునాయుడు పాలెం సమీపంలోని మలుపు వద్ద ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడంతో వాహనాలు అదుపుతపుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. అనేక ప్రమాదాలు జరిగి వాహనాల సిబ్బంది గాయాలపాలయ్యారు. అయినా కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడానికి ఆర్ అండ్ బీ అధికారులు చర్యలు చేపట్టలేదు. భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్న రహదారిలో వీధి లైట్ల ఏర్పాటుకు పంచాయతీ అధికారులు కూడా చర్యలు తీసుకోకపోవడంపై ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మలుపుల వద్ద హెచ్చరిక బోర్డుల ఏర్పాటు చేయడంతో పాటు ఎన్టీపీసీ దగ్గర నుంచి వెన్నలపాలెం రోడ్డు వరకు వీధి లైట్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అమ్మో.. ఆ రోడ్డులో ప్రయాణం



అంధకారంలో వెన్నలపాలెం–ఎన్టీపీసీ రహదారి

పరవాడ: వెన్నలపాలెం–ఎన్టీపీసీ రహదారిలో చీకట్లు అలముకున్నాయి. రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలకు వీధి లైట్లు ఏర్పాటు చేయని కారణంగా చీకటి రాజ్యమేలుతుంది. ఫలితంగా ప్రయాణికులు నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. చీకటి పడితే అవస్థలు ఎదుర్కొంటున్నారు. కటిక చీకట్లో ప్రయాణిస్తున్న వారికి రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. చీకటి పడిన తర్వాత ఆ రోడ్డులో ప్రయాణమంటే వాహనదారులు భయపడుతున్నారు. అలాగే వెన్నలపాలెం గ్రామంలో పలు వీధుల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి అంధకారంలో ఉన్న ప్రాంతాల్లో వీధి లైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ఘటనాస్థలిలో మృతి చెందిన దేముడమ్మ (ఇన్‌సెట్) దేముడమ్మ(ఫైల్)

పెందుర్తి: పశువులకు దాణా వేయడానికి కళ్లానికి వెళుతున్న ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిలో రాంపురం వద్ద జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. రాంపురంలో నివాసం ఉంటున్న బండారు దేముడమ్మ(68) ఆదివారం సాయంత్రం పశువులకు దాణా పెట్టేందుకు ఇంటి నుంచి కళ్లానికి బయలుదేరింది. గ్రామం వద్ద ఉన్న హైవే దాటుతుండగా అనకాపల్లి వైపు నుంచి వస్తున్న గూడ్స్ వాహనం ఆమెను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆమె రోడ్డుపై తుళ్లిపడడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు దేముడమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సింగంపల్లి సేవలు స్ఫూర్తిదాయకం



సింగంపల్లి వెంకట్రావు దంపతులను సత్కరిస్తున్న తోటి విద్యార్థులు

సబ్బవరం: తోటి విద్యార్థి సింగంపల్లి వెంకట్రావు సేవలు తమకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని సబ్బవరం ప్రాథమిక పాఠశాల 2000–2001 బ్యాచ్ విద్యార్థులు కొనియాడారు. పాఠశాలలో 23 ఏళ్ల కిందట చదివిన వారు ఆదివారం కలుసుకున్నారు. అంతా కలిసి ఆడిపాడారు. సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం తమతో కలిసి చదువుకుని ప్రస్తుతం సమాజ సేవ చేస్తున్న సింగంపల్లి వెంకట్రావు దంపతులను ఘనంగా సత్కరించారు. సింగంపల్లి సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, శ్రీకాళహస్తి దేవస్థానం ప్రతినిధులు సింగంపల్లిని సత్కరించారన్నారు. వెంకట్రావు స్ఫూర్తితో ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు గ్రూప్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

వైభవంగా నృసింహ హోమం



నృసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశంతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆదివారం నృసింహ హోమం వైభవంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లను అధిష్టింపజేసి పుణ్యాహవచనం, విష్వక్సేన ఆరాధన చేశారు. అనంతరం మండపారాధన, అగ్నిప్రతిష్ట, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. హోమంలో ఉంచిన ప్రధాన కలశాన్ని అర్చకుడు శిరస్సుపై పెట్టుకుని తిరువీధిగా ఆలయంలోకి వెళ్లి స్వామివారి మూలవిరాట్‌కు సమర్పించారు. అనంతరం ఆ పవిత్ర జలాలను భక్తులపై చల్లారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

14న మిగులు సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

సబ్బవరం: అనకాపల్లి, విశాఖ జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. విశాఖ జిల్లా పరిధిలోని 3, అనకాపల్లి జిల్లా పరిధిలోని 5 గురుకులాల్లో 5వ తరగతితో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 14న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. 5వ తరగతి ప్రవేశం కోసం 4వ తరగతి స్టడీ సర్టిఫికెట్, ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం పదో తరగతి ఉత్తీర్ణత పత్రం, ఆధార్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలోని గురుకులంలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 0891–2799641 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రైతు బజారులోకి ఆవులు



పెందుర్తి రైతు బజార్‌లోకి ఆవులు చొరబడడంతో వినియోగదారులు ఆందోళనకు గురవుతున్నారు. వినియోగదారుల తాకిడి ఉన్న సమయంలో పదుల సంఖ్యలో ఆవులు బజారులోకి చొరబడుతున్నాయి. రెండు రోజుల కిందట ఓ ఆవు మహిళపై దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆవుల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆవులు బజారులోకి రాకుండా నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - పెందుర్తి

పెండింగ్ కేసుల పరిష్కారంపై దృష్టి

- సిబ్బంది అందుబాటులో ఉండాలి
- సీపీ శంఖబ్రత బాగ్చి
- గోపాలపట్నం పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

గోపాలపట్నం: స్టేషన్ పరిధిలో పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి గోపాలపట్నం పోలీసులకు సూచించారు. ఆదివారం ఆయన గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదు దారులతో మాట్లాడారు. వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో కేసుల పరిష్కరించే తీరుపై ఆరా తీశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఖాళీ ప్రాంతాలను వ్యర్థాలతో నింపవద్దని సూచించారు. స్టేషన్‌లో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని చెప్పారు. అన్ని రిజిస్టర్లు అప్‌డేటెడ్‌గా ఉండాలని ఆదేశించారు. సిబ్బందితో మాట్లాడి వారి సమస్యల గురించి ఆరా తీశారు. పలు సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని సీపీ హామీ ఇచ్చారు. ఇతర సమస్యలు ఉంటే 7995095799 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు. గోపాలపట్నం స్టేషన్ శివారు ప్రాంతాల్లో ప్రతేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సీసీ కెమెరాలు మరింత ఎక్కువగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో గంజాయి పెడ్లర్స్ ఉండరాదని స్పష్టం చేశారు. విధుల్లో అధికార దుర్వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట: మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇవ్వాల్సిన రూ. 10 వేలు తక్షణం అందజేయాలని రాష్ట్ర మర పడవల సంఘం మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు కోరారు. ఈ మేరకు ఆయన నాయకత్వంలో పలువురు మత్స్యకారులు ఆదివారం అమరావతిలో మంత్రి కొల్లు రవీంద్రను కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను అప్పారావు ఈ సందర్భంగా మంత్రితో ప్రస్తావించారు.

ఉత్తర్వుల ప్రకారం వేతనాలు చెల్లించాలి

అగనంపూడి: ప్రభుత్వ ఉత్తర్వులు 36 ప్రకారం భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) కార్మికుల వేతనాలు చెల్లించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.నూకరాజు, ఉరుకూటి రాజు కోరారు. అగనంపూడి బొర్రమాంబ వనం వద్ద ఏర్పాటు చేసిన యూజీడీ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉత్తర్వుల ప్రకారం యూజీడీ కార్మికులకు వేతనం రూ.24,500 చెల్లించాలని, పదవీ విరమణ, అనారోగ్యంతో మృతి చెందడం వల్ల ఏర్పడిన ఖాళీలను తక్షణం వారి కుటుంబ సభ్యులతో భర్తీ చేయాలని, యూజీడీ కార్మికులను అదే స్థానంలో కొనసాగించాలని డిమాండ్‌చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12వ తేదీన జీవీఎంసీ గాంధీ పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు గొల గాని అప్పారావు, ఎస్.గణేష్, గొల్ల రాము, జె.ఆర్.నాయుడు, ఎస్.నాగరాజు, వై.చిన్నారావు, మీనాక్షి, సత్యవతి, ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక : గాజువాక జోన్ యూజీడీ కార్మికుల సంఘం నూతన కార్యవర్గాన్ని సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎస్.రఘు, పి.మహేష్, ఉపాధ్యక్షునిగా సీహెచ్ఎస్ నాయుడు, కోశాధికారిగా బి.శివశంకర్, కమిటీ ప్రతినిధులుగా జి.శ్రీను, పి.కోటి ఎన్నికయ్యారు.

అధిక పెన్షన్ చెల్లించాలని వినతి



ఎంపీ గొల్ల బాబూరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఈపీఎస్–95 సమస్యలు పరిష్కరించాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు కేంద్ర ఈపీఎఫ్‌వో అధికారులను కోరారు. సీ అధ్యక్షుడు కాటం చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్ న్యూఢిల్లీలో అధికారులను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో సుమారు 2 వేల మంది రిటైర్ట్, సర్వీసులో ఉన్న ఉద్యోగులు అధిక పెన్షన్ పొందేందుకు అర్హత కలిగి ఉన్నారన్నారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు 2023 అక్టోబర్–2024 ఫిబ్రవరి మధ్య అధిక పెన్షన్ కోసం రూ. 500 కోట్లు డిపాజిట్ చేశారని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటి వరకు అధిక పెన్షన్ జారీ చేయలేదన్నారు. దురదృష్టవశాత్తు స్టీల్‌ప్లాంట్‌కు చెందిన కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులకు పీపీవోలు జారీ చేసిన తర్వాత కూడా ఇప్పటి వరకు పెన్షన్ పంపిణీ కాలేదన్నారు. ఈ నేపథ్యంలో అధిక పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న ఉద్యోగులకు పెన్షన్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ ఎంపీలు విజయ్ బాఘేల్, గోడం నగేష్, వైఎస్సార్‌సీపీ ఎంపీలు గొల్ల బాబూరావు, ఆర్.కృష్ణయ్యలను కలిసి ఈపీఎస్ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

1 నుంచి ఏఐటీయూసీ సమావేశాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అచ్యుతరామయ్య తదితరులు

పెదగంట్యాడ: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను వచ్చేనెల 1నుంచి 3వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరామయ్య తెలిపారు. పెదగంట్యాడ పోతిన సన్యాసిరావు భవనంలో అహ్వాన సంఘం సభ్యులతో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సమావేశాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉక్కునగరంలో మూడు రోజుల పాటు సమావేశాలు జరుగుతాయని తెలిపారు. 3వ తేదీన సమావేశాల ముగింపు సందర్భంగా విశాఖలో సరస్వతి పార్కు నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం బహిరంగ సభ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, కె.రాజాబాబు, బి.ఆనంద్, యెల్లేటి శ్రీనివాసరావు, అచ్యుతరావు పాల్గొన్నారు.